క్లుప్తంగా

ప్రవేశాలకు దరఖాస్తులు

మహబూబాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయలో ఓపెన్ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మానుకోట ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు, కోఆర్డినేటర్ మల్లేశం మంగళవారం తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం అభ్యర్థులు ట్యూషన్ ఫీజును చెల్లించాలన్నారు. గతంలో ఫీజులు చెల్లించని విద్యార్థులు మళ్లీ ఫీజులు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. ఆగస్టు 18 వరకు చివరి తేదీ ఉందన్నారు. పూర్తి సమాచారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల 73829 29705 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు జన్మదినం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో 400 మంది బాలికలకు మంగళవారం న్యూట్రిషన్ కిట్లను క్లబ్ అదనపు డిస్ట్రిక్ సెక్రటరీ అనుమాల వెంకటేశ్వర్లు, సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజ, శ్రీవాణి, వసంత, సునీత, పద్మావతి, వీణా, స్వాతి, రంజాన్‌అలీ, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు సరి చేయించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

దంతాలపల్లి: మండలంలోని లక్ష్మీపురం, కుమ్మరికుంట్ల, రేపోణి గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందికి జారి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారనే శీర్షిక సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన విద్యుత్ అధికారులు మంగళవారం వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయించారు.

'100'కు మంచి స్పందన

మహబూబాబాద్ రూరల్: ఆపదలో ఉన్నవారి నుంచి డయల్ 100కు మంచి స్పందన వస్తోందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో బ్లూ కోల్ట్స్, పెట్రోకార్స్ సిబ్బందితో డయల్ 100 పనితీరుపై ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో డయల్ 100, 112 ద్వారా వచ్చిన ఫోన్లకు బ్లూ కోల్ట్స్ సిబ్బంది వీలైనంత త్వరగా స్పందించి, ఘటన స్థలానికి చేరుకోవడం ద్వారా నేరానికి సంబంధించిన తీవ్రతను వీలైనంత వరకు తగ్గించవచ్చని సూచించారు.

పురస్కారం ప్రదానం



నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన ప్రముఖ రాష్ట్ర స్థాయి డప్పు కళాకారుడు పెరుమాండ్ల బాబు (డప్పు బాబు)కు జాతీయ స్థాయి గౌతమి నంది మయూర పురస్కారం–2024 అందుకున్నాడు. హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో గౌతమేశ్వర గోసంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నంది పురస్కార సభలో అవార్డు అందుకున్నాడు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వేణుమాధవ్



తొర్రూరు: తొర్రూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బి.వేణుమాధవ్ నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో బురదమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. 22, 36 వార్డుల్లోని పలు కాలనీల్లో రోడ్లు గుంతలు పడి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పెరుగుకుమార్, శ్రావణ్, రవీందర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

మహబూబాబాద్: నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన డీసీఈబీ కమిటీలను రద్దు చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బద్రినారాయణ, ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యా శాఖ ప్రతిష్టను భంగపరుస్తున్న డీఈఓపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యలకు కేరాఫ్..

సోనియాగాంధీ నగర్ కాలనీ
- వంద గృహాలకు ఒక్కటే మీటరు
- కాలనీలో కనీస సౌకర్యాలు కరువు
- ప్రధానంగా రోడ్డు సౌకర్యం లేక అవస్థలు



సోనియాగాంధీనగర్ కాలనీ..



బురదమయంగా కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి



కాలనీ పక్కనే ఉన్న శ్మశానవాటిక

మహబూబాబాద్: సోనియాగాంధీనగర్ కాలనీ సమస్యలకు కేరాఫ్‌గా మారింది. కనీస సౌకర్యాలు లేక కాలనీవాసులు నరకం అనుభవిస్తున్నారు. దానికి తోడు రోడ్డంతా బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ సమీపంలోనే రెండు శ్మశానవాటికలు ఉండగా రోడ్డు సక్రమంగా లేక శవాలను తీసుకెళ్లలేని పరిస్థితి. విద్యుత్ సౌకర్యం లేక దూరం నుంచి ఒక సర్వీస్ వైర్ ఏర్పాటు చేసుకుని ఒక మీటర్ ద్వారానే వంద గృహాలకు విద్యుత్ సరఫరా చేసుకుంటున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు.

జిల్లా కేంద్రం శివారులో 8 ఏళ్ల క్రితం నాలుగున్నర ఎకరాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియాగాంధీ పేరున కాలనీ ఏర్పాటు చేశారు. కాలనీలో 120పైగా గృహాలను ఏర్పాటు చేసుకుని సుమారు 400నుంచి 500 మంది నివాసం ఉంటున్నారు. కాలనీకి ప్రధాన రోడ్డు సౌకర్యం లేకపోవడంతోపాటు అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు ఇతరత్రా ఎలాంటి సౌకర్యాలు లేవు. ముఖ్యంగా విద్యుత్ సౌకర్యం కూడా లేక కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. జీఓ 58 కింద 52 గృహాలలో నివాసం ఉండే వారికి పట్టాలు ఇచ్చారు. కాలనీ ఏర్పాటై దశాబ్ద కాలం కావస్తున్నా సౌకర్యాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక మీటరు ద్వారా వంద గృహాలకు..

కాలనీకి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఎర్రబోడ్ ప్రాంతం నుంచి సుమారు అరకిలో మీటరు దూరం నుంచి సర్వీస్ వైర్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. కాలనీకి త్రీఫేస్ మీటరు ద్వారా వంద గృహాలకు విద్యుత్ సరఫరా చేసుకుంటున్నారు. దీంతో మొత్తం విద్యుత్ బిల్లు ప్రతి నెలా రూ.40వేలు వస్తుంది. కాలనీ వాసులంతా కలిసి ప్రతి నెలా బిల్లు చెల్లిస్తున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని సంబంధిత కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు

కాలనీ సమీపంలో రెండు శ్మశానవాటికలు ఉన్నాయి. ఎవరైనా మృతి చెందితే శ్మశానవాటికలకు మృత దేహాలను తీసుకెళ్లేందుకు నరకయతన అనుభవిస్తున్నారు. శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతూ.. దగ్గరలోనే ఉన్న రైల్వే ట్రాక్‌పై నుంచి శ్మశానవాటికలకు మృతదేహాలను తీసుకెళ్తున్నారు.

విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించాలి

కాలనీకి ప్రధానంగా విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించాలి. కాలనీ ఏర్పాటై 8 ఏళ్లు దాటింది. జీఓ 58 కింద పట్టాలు ఇచ్చారు. అధికారులకు సమస్యలపై వినతులు ఇచ్చినా ఫలితం లేదు. వెంటనే కాలనీ సమస్యలు పరిష్కరించాలి.

– దిలీప్, కాలనీవాసి

'రుణమాఫీ ప్రక్రియలో అనేక లోపాలు'



మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

నెహ్రూసెంటర్: తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జరిగే దశలవారి ఆందోళనలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ ప్రక్రియలో అనేక లోపాలు ఉన్నాయన్నారు. రెండో విడత రుణమాఫీలో అర్హులైన రైతులకు మాఫీ వర్తించడం లేదన్నారు. కొత్త రేషన్‌కార్డులు, ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం వాటిని విస్మరించడమేనన్నారు. హామీలను అమలు చేయాలని ఆగస్టు1న మండల కేంద్రాల్లో ధర్నా, 8న కలెక్టరేట్ల ముట్టడి, 21న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నేతలు బిల్లకంటి సూర్యం, కందాల రంగయ్య, యాదయ్య, భాస్కర్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్ల శాతం పెంచాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ల శాతం పెంచి స్థానిక సంస్థల ఎన్నికలను జరపాలని బీసీ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు చొప్పరి శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంచి, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించడం హర్షనీయమన్నారు. ఆ దిశగా రాష్ట్రంలో కులాల జనాభా లెక్కలను తీయాలని, బీసీల డిమాండ్లను పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు.

కార్మికుల ముందస్తు అరెస్టు

కేసముద్రం: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సుమారు 30మంది జీపీ కార్మికులను మంగళవారం ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు. జీపీ కార్మికుల సమస్యలపై చలో అసెంబ్లీ కార్యక్రమం ఉండగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

దంతాలపల్లి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని అడిషనల్ డీఆర్‌డీపీ జయశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో స్వయంకృషి మండల సమైక్య అధ్యక్షురాలు అంకం లావణ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 8వ వార్షిక సభలో పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో నిరుపేద కుటుంబాల మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న మహిళా శక్తి సంక్షేమ పథకాలు, బ్యాంక్ లింకేజీ రుణాలు, శ్రీనిధి, సీఐఎఫ్ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వాలు అనేక సదుపాయాలు కల్పిస్తుందని, వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐబీ డీబీఎం గడ్డం శ్రీనివాస్, శ్రీనిధి ఆర్ఎం మధుసూదన్, ఏపీఎం దివాకర్‌రాయ్, వెంకన్న, రమనమ్మ పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల బెల్లం స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ ఉపేందర్‌రావు

డోర్నకల్: సీరోలు మండల పరిధిలోని అందనాలపాడు శివారు కొత్తతండా రోడ్డు వద్ద అక్రమం తరలిస్తున్న 25క్వింటాళ్ల నల్లబెల్లాన్ని పట్టుకున్నట్లు డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. మోదుగడ్డతండాకు చెందిన గుగులోత్ నరేష్, సీరోలు మండలం కొత్తూరుకు చెందిన కాంపెల్లి సాయి, కొత్తతండాకు చెందిన ఆటో డ్రైవర్ నూనావత్ బీకు ఆటోలో అందనాలపాడు సమీపంలోని పొదల్లో మంగళవారం నల్లబెల్లాన్ని డంప్ చేస్తుండగా ఎస్సై సంతోష్‌రావుతోపాటు సిబ్బంది పట్టుకున్నట్లు తెలిపారు. గుగులోత్ నరేష్, కాంపెల్లి సాయి పారిపోగా ఘటనా స్థలంలో 25 క్వింటాళ్ల నల్లబెల్లం, క్వింటా పటికను పట్టుకుని ఆటోతోపాటు డ్రైవర్ బికూను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డోర్నకల్: డోర్నకల్ సమీపంలోని గ్యాస్ సిలెండర్ల గోడౌన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఉయ్యాలవాడకు చెందిన సాయి డోర్నకల్ నుంచి ద్విచక్రవాహనంపై ఉయ్యాలవాడ వైపు వస్తుండగా బొడ్రాయితండాకు చెందిన రవి ద్విచక్రవాహనంపై వస్తూ ఢీకొట్టడంతో సాయికు తీవ్రగాయాలు కాగా రవికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

రైలునుంచి జారిపడి ఒకరికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: రైలు నుంచి జారిపడి ఒకరికి గాయాలైన సంఘటన మహబూబాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన జితేందర్ పాశ్వాన్ హంసఫర్ రైలులో ప్రయాణం చేస్తున్నాడు. రైలు మహబూబాబాద్ రైల్వే స్టేషన్ దాటి వెళ్తున్న క్రమంలో అతడు సిగ్నల్ కాలనీ సమీప ప్రాంతంలో రైలు నుంచి జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో స్వల్ప గాయలుకాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.


మూర్ఛతో మహిళ మృతి

నెల్లికుదురు: పొలం పనులు చేస్తూ ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని చిన్నముప్పారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. మృతురాలు భర్త కొత్తపల్లి వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి సునీత (35) కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధ పడుతుంది. ఈక్రమంలో తమ పొలంలో పనులు నిర్వహిస్తుండగా మూర్ఛ రావడంతో బురదలో పడిపోగా ఎవరు చూడలేదు. వెంటనే భర్త వెంకన్న వచ్చి చూసే వరకు అప్పటికే సునీత మృతి చెంది ఉంది.

యువకుడిపై కుక్కల దాడి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని 18వ వార్డు శిఖర్ ఖానగడ్డలో యువకుడు కె.సిద్దు నడుచుకుంటూ వెళ్తుండగా అతడిపై మంగళవారం కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. అతడిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

అంతా బురదే..!



పంతులు తండాలో రోడ్డు..

దంతాలపల్లి: మండలంలోని పంతులు తండాలో చిన్న పాటి వర్షాలకు రహదారి చిత్తడి అవుతోంది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే విద్యార్థులు, తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని తండావాసులు కోరుతున్నారు.

ధ్రువపత్రాల జారీలో ఇబ్బంది పెట్టొద్దు



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహబూబాబాద్: విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల విషయంలో అధికారులు ఇబ్బందులు పెట్టొదని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ జి.జ్యోతిబసు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జ్యోతి బసు మాట్లాడుతూ.. ధ్రువీకరణ పత్రాల విషయంలో తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి ఇబ్బందులు పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ల విషయంలో ఉద్యోగి డబ్బులు తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకపోతే ధ్రువీకరణ దరఖాస్తులను తిరస్కరిస్తుందని తెలిపారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కార్యాలయం చుట్టు తిరుగుతున్నారన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే ఉపేక్షించేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాకేష్, మహేష్, వినయ్, ప్రణయ్, మనోజ్ పాల్గొన్నారు.

ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలి



ల్యాప్‌టాప్ అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తొర్రూరు: సామాజిక సేవా సంస్థలు ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్లు డాక్టర్ రాజేందర్‌రెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహరావులు అన్నారు. లయన్ జి. బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్‌ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్కులో సేవా కార్యక్రమాలు చేపట్టారు. డయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించి 50 మందికి పరీక్షలు నిర్వహించారు. మండలంలోని ఫత్తేపురం గ్రామానికి చెందిన పేద విద్యార్థి పాక సుశాంత్‌కు ల్యాప్‌టాప్ అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తూరు మోడల్ స్కూల్ విద్యార్థిని విఘ్నేశ్వరి చికిత్స నిమిత్తం రూ.15 వేలు, పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, గొడుగులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, ప్రతినిధులు వెంకన్న, కిరణ్‌కుమార్, సరేష్, శారద, విశ్వేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రుణమాఫీతో రైతుల కళ్లల్లో ఆనందం



మాట్లాడుతున్న శంతన్ రామరాజు

మహబూబాబాద్ రూరల్: బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎన్ని కుట్రలు చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజాసంక్షేమ పాలన నిరాటంకంగా కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు అన్నారు. రెండో విడత రైతు రుణమాఫీని పురస్కరించుకుని రైతులతో కలిసి మంగళవారం సంబురాలు జరిపి శంతన్ రామరాజు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ. 2 లక్షల రుణమాఫీ చేసి రైతుల కళ్లల్లో ఆనందం నింపారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ రాములునాయక్, బొమ్మరాజు కుమారస్వామి, రామిశెట్టి ఉప్పలయ్య, రామరాజు బుచ్చయ్య, గుగులోత్ హస్సేన్, మాలోత్ బావ్‌సింగ్ పాల్గొన్నారు.

రుణమాఫీపై హర్షం

డోర్నకల్: మండలంలోని చిలుకోడు రైతువేదిక భవనంలో మంగళవారం జరిగిన రెండో విడత రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి రైతులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. రెండో విడత రుణమాఫీకి రూ.1.50లక్షలకు సంబంధించి మండలంలో 1,371 మంది రైతులు లబ్ధి పొందనున్నారు. రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సందేశాన్ని తిలకించిన రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణవేణి, వ్యవసాయ విస్తరణ అధికారులు అవినాష్, చరణ్‌తేజ పాల్గొన్నారు.

ఆర్థికంగా బలపడాలి

గూడూరు: ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న ఆర్థిక వనరుల ద్వారా ఆర్థికంగా బలపడాలని ఎంపీడీఓ వీరస్వామి, డీసీసీ బ్యాంకు మేనేజర్ చైతన్య అన్నారు. మండల కేంద్రంలోని ఉదయశ్రీ మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఏపీఎం రవీందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సమైక్య అధ్యక్షురాలిగా జోగ కౌసల్య, ఉపాధ్యక్షులు బొడ్డు సగుణమ్మ, కార్యదర్శిగా సౌజన్య, కోశాధికారి రేణుక, సహాయ కార్యదర్శి మమతను ఎన్నుకున్నారు. డీసీసీ మేనేజర్ చైతన్య, ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అసెంబ్లీ ముట్టడికి కాంట్రాక్టు ఉద్యోగులు

కేసముద్రం: తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ కింద అన్ని జిల్లాల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్లారు. దీంతో మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనానికి తాళం పడింది.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

కురవి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కురవి ఎంపీఓ మహమూద్ గౌస్ అన్నారు. మంగళవారం సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో ఎంపీఓ మహమూద్ గౌస్ పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు చేశారు. కాల్వలను శుభ్రం చేశారు. కార్యదర్శి అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు: ప్రభుత్వం ఏజెన్సీ మండలాల్లోని విలేకరుల సమస్యలను పరిష్కరించాలని ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముక్తవరం సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మండల శాఖ టీడబ్ల్యూ ఐజేయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్వేతకు అందించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు గుర్రపు యాకాంబ్రం, జిల్లా ఉపాధ్యక్షుడు కోరె పాపయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌కి చెందిన డి.నర్సయ్య, జి.సోమక్క ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈమేరకు మంగళవారం అంతర్యామి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకన్న డిమాండ్ చేశారు. బీకేఎంయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. అన్ని మున్సిపాలిటీలలో కూడా ఉపాధి హామీ పథకంను అమలు చేయాలన్నారు. 200రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. 50ఏళ్లు నిండిన ప్రతి వ్యవసాయ కూలీకి రూ.10వేల పింఛన్ ఇవ్వాలన్నారు.

గుండెపుడికి ఆర్టీసీ బస్ సర్వీసు కల్పించాలి

మరిపెడ రూరల్: విద్యార్థులు, ప్రజల ప్రయాణ సౌకర్యార్థంగా మండలంలోని గుండెపుడి గ్రామానికి ఆర్టీసీ బస్ సర్వీసు కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గుండగాని మధుసుదన్, అల్లి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం మహబూబాబాద్ బస్ డిపో మేనేజన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బస్ సర్వీస్ లేకపోవడంతో గ్రామస్తులు ప్రయాణానికి నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి గుండెపుడి గ్రామానికి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటల బస్ సర్వీసులు నడిపించాలని వారు కోరారు.

ధర్నాకు తరలిన కార్మికులు

గార్ల: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించే మహాధర్నాకు గార్ల మండలం నుంచి పంచాయతీ కార్మికులు బయలుదేరి వెళ్లారు. దాను, జి కిషన్, వీరస్వామి, శ్రీను, తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కురవి: సీరోలు మండల ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా మక్కల వీరన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పెరుగు రాజుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఆకోజు శ్రీనివాస్, కోశాధికారిగా గుగులోత్ భాస్కర్, సహాయ కార్యదర్శిగా బాణాల సతీష్, కార్యవర్గసభ్యులుగా అశోక్, వెంకటనారాయణ, హనుమతుల రాజు, అనిల్, యాకన్నలను ఎన్నుకున్నారు.

పార్టీని బలహీన పర్చడం తగదు

గార్ల: కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు చేస్తూ పార్టీని బలహీన పరుస్తున్న కాంగ్రెస్ నాయకులపై పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు మంగళవారం డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశాడు. మండలంలోని పుల్లూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రహస్య సమావేశం ఏర్పరచుకొని ఎమ్మెల్యే కోరం కనకయ్య అతని అనుచరులపై అసత్య ప్రచారం చేయడమే కాకుండా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన పార్టీ సీనియర్ నాయకులపై ఆయన ఫిర్యాదు చేశారు.

ఇంటింటా పచ్చదనం ఉండాలి

తొర్రూరు రూరల్: ప్రతి గ్రామంలోని ఇంటింటా చెట్లతో పచ్చదనంగా ఉండాలని ఎంపీడీఓ వేణుగోపాల్ సూచించారు. మంగళవారం మండలంలోని పత్తేపురం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి వర్షకాల సీజన్‌లో నర్సరీల్లో పెంచిన అనేక రకాల మొక్కలను ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు.

రెండు నెలలగా బందెలదొడ్డిలోనే గేదెలు

గార్ల: మండలంలోని పోచారం గ్రామ పంచాయతీ బందెలదొడ్డిలో 2నెలల నుంచి 3గేదెలు ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి రమేష్ మంగళవారం తెలిపాడు. గేదెలు పోయిన వారు పోచారం వచ్చి చూసుకోవాలని ఆయన కోరారు. లేనిఎడల వారం రోజుల్లో గేదెలకు వేలంపాట పెట్టి అమ్మేస్తామన్నారు.

క్వింటా బియ్యం అందజేత

దంతాలపల్లి: మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన గుడెల్లి యాకయ్య భార్య లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. యాకయ్య స్నేహితులు క్వింటా బియ్యం, రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వేణు, సుధాకర్, శ్రీనివాస్, వెంకన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం

తొర్రూరు రూరల్: మండలంలోని పత్తేపురం గ్రామ శివారులోని జామాయిల్ తోటలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించిన ఆనవాళ్లు మంగళవారం కనిపించాయి. ఇట్టి విషయంపై స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా, తమకు ఎలాంటి సమాచారం లేదని, ఇలాంటి వాటితో ప్రజలు ఎవరు కూడా భయాందోళన చెందవలసిన అవసరం లేదని ఎస్సై జగదీష్ చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా ఐటీఐ కళాశాలలు



మహబూబాబాద్ అర్బన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిబంధనలు పాటించని ఐటీఐ కళాశాలలపై చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం కళాశాలల కన్వీనర్ తిరుపతిరావుకు పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో సరైన మౌళిక వసతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నడుపుతున్నారన్నారు. తక్షణమే ప్రైవేట్ ఐటీఐ కళాశాలలపై విచారణ జరిపి వాటి రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాదారపు నాగరాజు, కోశాధికారి మునగాల మహేష్, జిల్లా నాయకులు బాలకృష్ణ, విజయ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



పొంగి పొర్లుతున్న పాకాల ఏరు

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏరు మంగళవారం చెక్‌డ్యాం పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గార్ల నుంచి రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రాంపురం మద్దివంచ పంచాయతీల ప్రజలు వేడుకుంటున్నారు.